


నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, సోమవారం 4 నవంబర్ 2024 | MEDAK



సిద్దిపేట కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

# అవినీతికి ఖాకీ అండ

- నేరస్తులతో అంటకాగుతున్న పోలీసులు
- గంజాయి స్మగ్లర్లతో మిలాఖత్
- ఇసుక అక్రమ రవాణాలో ముఖ్య పాత్ర
- సివిల్ వ్యవహారాల్లోనూ జోక్యం
- సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు ఆరోపణలు
- వరుసగా వెలుగుచూస్తున్న అవినీతి వ్యవహారాలు
- అధికారుల సస్పెన్షన్లతో పోలీస్ శాఖకు అప్రతిష్ట



సంగారెడ్డి, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఖాకీ చొక్కాకు అవినీతి మరక అంటుతున్నది. పోలీసులు నేరస్తులతో స్నేహం చేస్తున్నారు. గంజాయి స్మగ్లర్లు, అక్రమ మైనింగ్ దార్లతో జట్టుకట్టి అవినీతికి పాల్పడుతున్నారు. సివిల్ వ్యవహారాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. భూముల విలువ అధికంగా ఉండే సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది సెటిల్‌మెంట్లు చేసి అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో గంజాయి సాగు, రవాణా, అమ్మకాలను రూపుమాపేందుకు ఎస్పీ రూపేశ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బృందాల ద్వారా దాడులు చేయిస్తున్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేయిస్తున్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్న తరుణంలో జిల్లాకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది గంజాయి స్మగ్లర్లతో కలిసి అవినీతికి పాల్పడుతున్నట్లు తేలడం పోలీసు శాఖకు మింగుడు పడడం లేదు. సొంత అధికారులే స్మగ్లర్లతో కలిసి పోవడంతో పోలీసు శాఖ ప్రతిష్ట దెబ్బతింటున్నది. గంజాయి స్మగ్లర్లతో జట్టుకట్టిన ఇద్దరు ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై ఇటీవల సస్పెన్షన్ వేటు పడడం అన్నివర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. గంజాయి స్మగ్లర్లను కటకటాల వెనక్కి పంపాల్సిన పోలీసు అధికారులే స్మగ్లర్లతో జతకట్టి అవినీతికి పాల్పడడం విస్తుగొల్పుతున్నది. ఇటీవల కాలంలో సంగారెడ్డి జిల్లాలో పోలీసు అధికారులు వరుసగా సస్పెన్షన్లకు గురి అవుతుండడం చర్చకు దారితీస్తున్నది.


### గంజాయి స్మగ్లర్లతో పోలీసుల మిలాఖత్

సంగారెడ్డి జిల్లాలో ఇటీవల గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వీటిని అరికట్టేందుకు పోలీస్, ఎక్సైజ్ శాఖలు కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. పోలీసు ఉన్నతాధికారుల చర్యలకు గండికొట్టేలా సిబ్బంది గంజాయి స్మగ్లర్లతో కలిసి అవినీతికి పాల్పడడం శాఖకు చెడ్డపేరు తెస్తున్నది. ఇటీవల గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడిన మల్లుగోడ, మల్లేశ్ నాయక్, లకాస్ అనే నిందితులను బీడీఎల్ పోలీసులు విచారించగా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మనూరు ఎస్సైగా పనిచేసి ప్రస్తుతం పటాన్‌చెరులో ఎస్ఐగా పని చేస్తున్న అంబారియా, వీఆర్ ఎస్సై వినయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ మారుతినాయక్, ఏఆర్ కానిస్టేబుల్ మధు గంజాయి పట్టుకుని, స్మగ్లర్లను వదిలివేసి అవినీతికి పాల్పడినట్లు పోలీసు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. దీంతో ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు కానిస్టేబుళ్లను శుక్రవారం ఐజీ సత్యనారాయణ సస్పెండ్ చేశారు. ఇది పోలీసు శాఖలో సంచలనంగా మారింది. జిల్లాలోని మరికొంత మంది పోలీసులకు గంజాయి స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు లోతైన విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలో విఫలమయ్యారంటూ ఇటీవల సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ, ఎస్సైలను ఐజీ సత్యనారాయణ విధుల్లోంచి తొలిగించి వీఆర్‌కు పంపించారు. ఈ ఇద్దరు అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా అరికట్టడంలో విఫలం కావడంతో పాటు అవినీతికి పాల్పడినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలడంతో చర్యలు తీసుకున్నారు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి వీఆర్‌కు వెళ్లిన ఎస్సై వినాయక్‌కుమార్ గంజాయి స్మగ్లర్లతో జతకట్టారన్న ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురయ్యారు. రెండు నెలలల క్రితం వట్‌పల్లి ఎస్సై పోలీస్‌స్టేషన్‌లో ఓ ప్రజాప్రతినిధి జన్మదిన వేడుకలు నిర్వహించి హడావిడి చేయడంతో ఉన్నతాధికారులు ఆయనపై బదిలీ వేటు వేశారు. పటాన్‌చెరు డివిజనల్‌లో ఓ కేసు విషయంలో సీఐ సక్రమంగా విధులు నిర్వహించకపోవటంతో అతన్ని సస్పెండ్ చేశారు. జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది అవినీతి ఆరోపణలతో సస్పెండ్, బదిలీలు కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# ఉద్యోగులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

## మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, నవంబర్ 3 : రాష్ట్రంలో ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయక కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేటలోని విపంచి కళా నిలయంలో జరిగిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పొన్నమల రాములు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాములుతో తనకు రెండు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. ప్రజా ఉద్యమాలు, సామాజిక సేవ ద్వారా తమకు పరిచయం ఏర్పడిందన్నారు. వారి కృషితోనే సిద్దిపేట పట్టణంలో మొట్ట మొదటి ఉపాధ్యాయ భవనం ఏపీటీఎఫ్ నిర్మించుకున్నామని తెలిపారు. విరమణ ఉద్యోగానికే కాని, ప్రజాసేవకు కాదన్నారు. అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్ల ఫలితం అందేలా భవిష్యత్‌లో ఆయన పాటుపడాలన్నారు. ఇందుకు తన సహకారం ఎంతో ఉంటుందన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి రిటైరైనా వారం రోజుల్లో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వస్తాయని, కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ఇస్తదో చెప్పడం లేదన్నారు. పెండింగ్ 3 డీఏలు ఇస్తామని ఇవ్వలేదన్నారు. ఇప్పుడు 5 డీఏలు పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. కొత్త పీఆర్‌సీ వెంటనే అమలు చేస్తామని చెప్పి 11 నెలలు గడిచినా ఉలుకూ పలుకు లేదన్నారు. పాత పెన్షన్ విధానం తెస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక కమిటీ కూడా వేయలేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు 7 వేల మంది రిటైర్ ఉద్యోగులకు గ్రాట్యుటీ బెనిఫిట్స్, జీపీఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వలేదన్నారు. దేశంలో రిటైర్డ్ ఉద్యోగులకు మూడేండ్ల తర్వాత రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని ఎద్దేవా చేశారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇవ్వకపోవడం దురదృష్టకరమన హరీశ్‌రావు అన్నారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, టీపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు రాములును జ్ఞాపికతో సత్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి




నర్సాపూర్ ఏరియా దవాఖానలో రోగితో మాట్లాడుతున్న సునీతాలక్ష్మారెడ్డి

# రోగులకు మెరుగైన సేవలు అందించాలి

## నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, నవంబర్ 3: రోగులకు మెరుగైన సేవలు అందించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వైద్యులకు సూచించారు. ఆదివారం నర్సాపూర్‌లోని ఏరియా దవాఖానాను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యులనుతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సోమవారం ప్రారంభించనున్న కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దవాఖానకు వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సూచించారు. రోగులకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీముద్దీన్, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, ప్రసాద్, శ్రీకాంత్, వీరేందర్, సలీం, సద్దాం, వైద్య సిబ్బంది ఉన్నారు.



పోతులబొగుడలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# రైతులకు ఇబ్బందులు తలెత్తనివ్వొద్దు

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, నవంబర్ 3 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి సూచించారు. ఆదివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో దంతాన్‌పల్లి, కొంతాన్‌పల్లి, పోతులబోగుడ, ఉసిరికపల్లి, పిల్లుట్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణాగౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ మాజీ కోఆప్షన్ మన్సూర్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, రైతుసమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పీఏసీఎస్ సీఈఓ మధుయాదవ్, తూము కృష్ణారావు, రాజశేఖర్ గౌడ్, గూడూరు యాదగౌడ్, ఆకుల శ్రీనివాస్, చింతస్వామి, దుర్గం రమేశ్, శ్రీనివాస్ గౌడ్, ఏనుగు అశోక్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో దళారుల దర్జా



మెదక్ జిల్లా అంబాజీపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని లారీలో నింపుతున్న హమాలీలు




మెదక్ జిల్లా కొట్టాలలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో దళారులకు ధాన్యం అమ్ముకుంటున్న రైతులు

చిన్నశంకరంపేట, నవంబర్ 3 : ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో దళారులు నేరుగా రైతుల వద్ద వడ్లను కొంటున్నారు. ప్రభుత్వం 20 రోజులు క్రితం అట్టహాసంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. కానీ, ధాన్యం కాంటా చేయడం లేదు. ఇదే అదునుగా భావించిన దళారులు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువ ధరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వచ్చి దళారులు ధాన్యం తూకం వేస్తున్నారు. ఇంత జరిగినా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మండలంలోని అంబాజిపేట కొనుగోలు కేంద్రంలో దళారులు ధాన్యాన్ని కొనుగోలు చేసి లారీల్లో తరలించారు. ఇప్పటికైనా కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### ధాన్యం దళారుల పాలు

కౌడిపల్లి, నవంబర్ 3: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్లలో ధాన్యాన్ని సేకరించడం లేదు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తప్పేది లేక రైతులు దళారులకు వడ్లను అమ్ముకుంటున్నారు. కౌడిపల్లి మండలంలోని కొట్టాల గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఆదివారం రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాల్లో త్వరగా కాంటా పెట్టాలని రైతులు కోరుతున్నారు.

# టెండర్లతో సరి.. పనుల ప్రారంభమేదీ..?


- హుస్నాబాద్ బల్దియాలో సాగని అభివృద్ధి పనులు
- మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి

హుస్నాబాద్ టౌన్, నవంబర్ 3: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బల్దియాలో అభివృద్ధి పనులు ముందుకెళ్లడం లేదు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు రూ.40 కోట్లు మంజూరయ్యాయి. కానీ, అభివృద్ధి పనులు చేపట్టే విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. హుస్నాబాద్ పట్టణంలోని ఇరవై వార్డుల్లో అంతర్గత రహదారులు, మురుగుకాల్వలు, విద్యుత్, మంచినీటి వసతుల కల్పనకు టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల ద్వారా సీసీరోడ్లు, మురుగుకాల్వలు, పార్కు, మున్సిపల్ నూతన భవనం ప్రహరీ, కమ్యూనిటీ హాళ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులకు సంబంధించి ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించి ఏజెన్సీలకు పనులు అప్పగించి రెండు నెలలు గడుస్తున్నది. ఆయా వార్డుల్లో పనుల శంకుస్థాపనకు ప్రత్యేకంగా శిలాఫలకాల నిర్మాణాలు సైతం చేపట్టారు. కానీ, పనుల్లో పురోగతి లేకపోవడంతో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

### ఏజెన్సీలకు పనులు అప్పగించాం...

హుస్నాబాద్ పట్టణానికి టీయూఎఫ్ఐడీసీ కింద మంజూరైన రూ.40కోట్ల పనులకు టెండర్లు పూర్తి చేసి వర్క్ ఏజెన్సీలకు అప్పగించాం. నెలన్నర రోజులు గడుస్తున్నది. పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్లకు సూచించాం. ఇంకా కొన్ని అగ్రిమెంట్లు చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి కృషి చేస్తాం.

– పృథ్వీరాజు, హుస్నాబాద్ మున్సిపల్ ఏఈ





సీసీరోడ్డుగా మారనున్న హుస్నాబాద్ ఎల్ఐసీ కాలనీలోని రోడ్డు, పనులు ప్రారంభించేందుకు నిర్మించిన శిలాఫలకం

# భయం భయం.. అంధకారంలో ప్రయాణం



హుస్నాబాద్ టౌన్: పట్టణంలోని మడద రోడ్డులోని కేజీబీవీ

హుస్నాబాద్ టౌన్, నవంబర్ 3: ఆ రోడ్డుపై ప్రయాణం ఇప్పుడు అందరినీ భయపెడుతున్నది. వందలాది మంది విద్యార్థులు విద్యనభ్యసించే కేజీబీవీతో పాటు కొత్తకాలనీ, మున్సిపల్‌కు చెందిన డీఆర్‌సీసీ కేంద్రాలకు వెళ్లడానికి అదే ప్రధాన రహదారి. నిత్యం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రయాణికులు ఈ మార్గంలో విద్యుత్ దీపాలు లేకుండా చీకట్లోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. హుస్నాబాద్ పట్టణంలో మూడు రోజుల క్రితం జరిగిన లైంగికదాడి ఘటన పలువురిని భయాందోళనలకు గురిచేసింది. కేజీబీవీతోపాటు కాలనీకి నిత్యం వందలాది మంది వచ్చిపోతుంటారు. ఈ ప్రధాన రహదారికి విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో రాత్రయితే బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రక్షణ కోసం వీధిదీపాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, తమకు ఏం పట్టనట్లు మున్సిపల్ అధికారుల వ్యవరిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జరుగుతున్న పరిణామాలను పోలీస్‌శాఖ సీరియస్‌గా తీసుకున్నప్పటికీ, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాల్సి ఉండగా తాత్సారం చేస్తుండడంతో ఆ ప్రాంత వాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఆ ప్రాంత విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజల సమస్యపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ స్పందించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.



హుస్నాబాద్ టౌన్: పట్టణంలోని మడద రోడ్డులో కనిపించని విద్యుత్ దీపాలు

# క్రీడాకారులకు సహకారం అందిస్తా



తైక్వాండోలో మెడల్స్ సాధించిన వారిని అభినందిస్తున్న హరీశ్‌రావు

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 3: ఇటీవల వికారాబాద్‌లో జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీల్లో సిద్దిపేట జిల్లా తైక్వాండో అసోసియేషన్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. అండర్-14 విభాగంలో పి.పురంధర అండర్ 20 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, ఎం.పునీత్‌రెడ్డి అండర్-29 కేజీల విభాగంలో సిల్వర్, ఈ.నిశాంత్ అండర్-32 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, టి.తనీష్ వినయ్ అండర్-41 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అభినందించారు. గోల్డ్ మెడల్ సాధించిన పి.పురంధర్ ఈనెల 8 నుంచి 12 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విదిశలో జరిగే 68వ జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్, తైక్వాండో పోటీలకు ఎంపికా కావడంతో హరీశ్‌రావు అభినందించారు. క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, సీనియర్ నాయకులు మారెడ్డి రవీందర్‌రెడ్డి, పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఘనపూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


# ఘనపూర్ పంప్‌హౌస్ పూర్తికావాలి

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, నవంబర్ 3: సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలం ఘనపూర్ గ్రామం వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్ పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే యాసంగికి ఎట్టి పరిస్థితిల్లో నీళ్లు అందించాలని అధికారులకు సూచించారు. పదకొండున్నర కిలో మీటర్ల కెనాల్‌కు ఏడున్నర కిలోమీటర్లు పూర్తయిందని, మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ పంప్‌హౌస్ పూర్తి చేసి కెనాల్ ద్వారా ఘనపూర్‌లో 4 చెరువులు, అక్కెనపల్లిలో 4 చెరువులు, గట్లమల్యాలలో 5 చెరువులు, మొత్తం 13 చెరువుల్లో ఈ యాసంగికి నీళ్లు నింపాలని అధికారులను కోరారు. మోటర్లు బిగించి నీళ్లు పంపింగ్ చేయాలని, విద్యుత్ పనులు పూర్తి చేయాలన్నారు. హరీశ్‌రావు వెంట మండల నాయకులు ఉన్నారు.

# ఏడుపాయల్లో భక్తుల సందడి

పాపన్నపేట, నవంబర్ 3: మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో వేద పండితులు వేకువజాము నుంచే పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు సమర్పించి మొక్కుకున్నారు. ఈవో చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది సూర్యశ్రీనివాస్, మాధుసూదన్‌రెడ్డి, బ్రహ్మాచారి, రవివీర్‌కుమార్, వరుణాచారి, రాజు, నర్సింలు భక్తులకు సేవలందించారు. వేదపండితులు శంకర్‌శర్మ, పార్థివశర్మ, రాముశర్మ, రాజశేఖర్ శర్మ ప్రత్యేక పూజాలు చేశారు. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించారు. పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుంకరి కృష్ణ , సాయ్యా, మండల శాఖ నాయకులు రాజు,మల్లారెడ్డి ఉన్నారు.



పూజలు అందుకుంటున్న వన దుర్గామాత